
www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 7 ఆగస్టు 2023





వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-నెల్లూరు :ఈ నెల 21,22 తేదీలల్లో విజయవాడలో నిర్వహించనున్న ఎపి ఎన్‌జిఒ 21వ రాష్ట్ర మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఆదివారం మంత్రి క్యాంపు కార్యాలయంలో ఎన్‌జిఒ సంఘం నాయకులు కలిసి ఈ మహాసభలకు హాజరు కావాల్సిందిగా కోరుతూ ఆహ్వాన పత్రి అందజేసి, అనంతరం గోడపత్రికను ఆవిష్కరింపచేశారు. ఏపీ యన్ జి ఓస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మన్నేపల్లి పెంచలరావు,నాయుడు, వెంకటస్వామి, జిల్లా కోశాధికారి బందారుపల్లి.వెంకటేశ్వర్లు, అసోసియేట్ అధ్యక్షులు నందిమండలం ఆంజనేయ వర్మ, ఆర్గనైజింగ్ కార్యదర్శి గాదిరాజు రామకృష్ణ, ఉపాధ్యక్షులు నల్లగొండ.మధు, నగర కార్యదర్శి దేగల మార్కం డేయులు,పొదలకూరు అధ్యక్షులు కే.శ్రీనివాసులు నగర కార్యవర్గ సభ్యులు ఈ.శ్యామ్ సన్ బాబు ఉన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి

రాయలసీమ, నెల్లూరు ప్రాజెక్టులు చేపట్టాం..!

- ఇరిగేషన్‌పై జగన్‌కు అవగాహన లేదు..
- మెట్ట ప్రాంతాలకు సాగునీరిస్తాం..
- టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి

రాయలసీమ, నెల్లూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు చేపట్టిందని టిడిపి ప్రభుత్వమేనని, రానున్న రోజుల్లో మెట్ట ప్రాంతాలకు సాగునీరిచ్చి కరువు తీరుస్తానని టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. ఆదివారం నెల్లూరు జిల్లాలోని ప్రాజెక్టుల విధ్వంసంపై యుద్ధభేరి కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానిక కస్తూరిదేవి గార్డెన్‌లో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. చంద్రబాబు మాట్లాడుతూ దేశంలో నదుల అనుసంధానం ద్వారానే అభివృద్ధి సాధ్యమవుతుందని, కావేరి, కృష్ణా, గోదావరి, పెన్నా నదులు కలపాల్సి ఉందన్నారు. దక్షణ భారత దేశంతోపాటు, ఎపి అభివృద్ధి చెందాలంటే నదుల అనసంధానం ఎంతో అవసరమన్నారు. ప్రాజెక్టులపై కనీస అవగాహన లేని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. నెల్లూరు జిల్లాలో జరిగిన ప్రాజెక్టులు టిడిపి ప్రభుత్వ హయంలోనేనన్నారు. 2014 తర్వాత నదీ జలాల సక్రమ, సమగ్ర వినియోగంపై ఒక విధానం సిద్ధం చేశామన్నారు. దేశంలో ఏ రాష్ట్రానికి లేని సాగునీటి వనరుల లభ్యత మన రాష్ట్రానికి ఉందన్నారు. దీనిని వినియోగించుకుంటే మంచి ఫలితాలు వస్తాయని, రైతులకు సాగునీటి ఇబ్బందులు తొలుగుతాయన్నారు. రాష్ట్రంలో ఉన్న ప్రధాన ఐదు నదుల అనుసంధానంతో నీటి కరువు అనేది ఉండదన్నారు. రాయలసీమ, నెల్లూరు జిల్లాలోని తెలుగు గంగ, హంద్రీనీవా, గాలేరు నగరి ప్రాజెక్టులు చేపట్టింది ఎన్‌టిఆర్ అన్నారు. సోమశిల కెపాసిటీ పెంచి ప్రారంభించిన ఘనత ఎన్టీఆర్ కు దక్కుతుందన్నారు. దీని వల్ల నెల్లూరు జిల్లాకు నేడు లబ్ధి జరుగుతుందన్నారు. పోలవరం పూర్తి చేయడానికి సమయం పడుతుందని, పట్టిసీమ లిఫ్ట్ కట్టాం.. దీని వల్ల కష్ణా డెల్టాకు నీరు ఇవ్వగలిగామన్నారు. పట్టిసీమ వల్ల గోదవరి నీరు కష్ణాడెల్టాకు ఇచ్చి....డెల్టాకు రావాల్సిన నీటిని పొదుపు చేసి శ్రీశైలంనుంచి రాయలసీమకు నీరు ఇచ్చామన్నారు. నదుల అనుసంధానంలో భాగంగా పట్టిసీమ వల్ల రెండు ప్రాంతాలకు లబ్ధి జరిగిందన్నారు. పట్టిసీమ వల్ల 120 టిఎంసిల నీరు, వైకుంఠ పురం వల్ల 130 టిఎంసిల నీరు ను పొదుపు చేసి...ఆ 250 టీఎంసీల నీటిని రాయల సీమకు ఇవ్వొచ్చునన్నారు. గోదావరి నీటిని పెన్నాకు తీసుకువచ్చేందుకు ప్రతిపాదించిన పనుల్లో మొదటి ఫేజ్ పనులకు శంకుస్థాపన చేశామన్నారు.. అదే వైకుంఠపురం ప్రాజెక్టు అన్నారు. గోదావరి నీటిని బనకచర్లకు తీసుకు వస్తే రాయలసీమకు నీరు ఇవ్వొచ్చునన్నారు. బనకచర్లకు గోదావరి నీరు వస్తే 5 జిల్లాలకు సాగునీరు వస్తుందన్నారు.

తక్కువ ఖర్చుతో ఎక్కువ ఎకరాలకు నీరు

తక్కువ ఖర్చుతో ఎక్కువ ఎకరాలకు నీరిచ్చే అవకాశం ఉండే రాష్ట్రం మనదేనని చంద్రబాబు పేర్కొన్నారు. దేశంలో బిఒటి ద్వారా నేషనల్ హైవేకు నాంది పలికింది నెల్లూరు టు చెన్నై రోడ్డు అని, ఇది పేటిఎం వాళ్లకు తెలియదన్నారు. దేశంలో నదుల అనుసంధానం, బిఒటి పద్ధతి ద్వారా హైవేల నిర్మాణం కోసం నాడు ప్రయత్న చేశానన్నారు. రాష్ట్రంలో ఇరిగేషన్ కోసం 2014 నుంచి 2019 వరకు టిడిపి ప్రభుత్వం రూ.68 వేల కోట్లు ఖర్చు పెడితే వైసీపీ కేవలం రూ.22 వేల కోట్లు మాత్రమే ఖర్చు పెట్టిందన్నారు. టిడిపి హయాంలో నెల్లూరుతో కలిసి సీమ జిల్లాలకు రూ.13939 కోట్లు ఖర్చుపెడితే... వైసిపి హయాంలో పెట్టిన ఖర్చు కేవలం రూ.2637 కోట్లు.అన్నారు. నెల్లూరు జిల్లాకు వెలుగులు తెచ్చిన ప్రాజెక్టు తెలుగు గంగ. సోమశిల, కండలేరు ప్రాజెక్టుల ద్వారా నెల్లూరు కు 146 టిఎంసిల నీరు అందుబాటులోకి వచ్చిందన్నారు. తెలుగు గంగ ద్వారా కష్ణా జలాలను పెన్నాలో కలిపి దేశంలో నదుల అనుసంధానానికి అన్న ఎన్టీఆర్ నాంది పలికారని గుర్తుచేశారు. రాజశేఖర్ రెడ్డికి ఇరిగేషన్‌పై అవగాహన ఉందని, కానీ ఈ మూర్ఖుడు జగన్ కు పులివెందుల నీళ్ళు ఎక్కడ నుంచి వస్తాయో కూడా తెలీదని ఎద్దేవా చేశారు. టిడిపి హయాంలో సోమశిల ప్రాజెక్టుపై రూ. 611 కోట్లు , కండలేరుప్రాజెక్టుకు రూ. 142 కోట్లు ,,కండలేరు ప్రాజెక్టు ద్వారా అటవీ శాఖ అనుమతులు తెచ్చి 1.30 లక్షల ఎకరాలకు ఆదనపు ఆయకట్టు తెచ్చింది తమేనన్నారు. కండలేరు లిఫ్ట్ కు రూ.64 కోట్లు ఖర్చుపెట్టామన్నారు. సోమశిల స్వర్ణముఖి లింక్ కెనాల్ కు టీడీపీ 134 కోట్లు ఖర్చుపెడితే.. .వైసీపీ కేవలం 18 కోట్లు ఖర్చుపెట్టిందన్నారు. ఇప్పుడు పనులు కూడా సాగడం లేదు అన్నారు.. సోమశిల హైలెవల్ కెనాల్ ఫేజ్ 1 కు టీడీపీ హయాంలో రూ.521 కోట్లు ఖర్చు చేస్తే...వైసీపీ కేవలం రూ. 82 కోట్లు ఖర్చుపెట్టింది. ఈ ప్రాజెక్టులో మిగిలిన 30శాతం పనులను కూడా పూర్తిచే యలేదన్నారు. ఆల్తూరుపాడు ప్రాజెక్టుకు టిడిపి హయాంలో 293 కోట్లు ఖర్చు చేశాం. వైసీపీ రివర్స్ టెండరింగ్ పేరుతో దాన్ని అటకెక్కించిందన్నారు. సంగం బ్యారేజ్ కు టీడీపీ హయాంలో రూ.88 కోట్లు ఖర్చు పెట్టాం. వైసీపీ మిగిలిన 17 శాతం పనుల పూర్తి చేయడానికి మూడున్నరేళ్లు తీసుకుందన్నారు. నెల్లూరు బ్యారేజ్ ని టీడీపీ 80 శాతం పూర్తి చేస్తే వైసీపీ 10 శాతం పూర్తి చేసి ప్రారంభోత్సవం చేసుకున్నారన్నారు. పెన్నా డెల్టా ఆధునీకరణకు టిడిపి హయాంలో రూ.126 కోట్లు ఖర్చు పెట్టామన్నారు. 2019 -20తో పోల్చితే రాష్ట్రంలో ప్రభుత్వ విధానాల కారణంగా 8 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి తగ్గిపోయిందన్నారు. .తెలంగాణలో 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి పెరిగిందన్నారు. ఒక అసమర్థుడి చేతికి అధికారం ఇస్తే ఇలాంటి ఫలితాలే వస్తాయన్నారు ..టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, మాజీ మంత్రులు దేవినేని ఉమా మహేశ్వరరావు, పి. నారాయణ, ఎంఎల్‌సి ఆనం రామనారాయణరెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, పనబాక లక్ష్మీ, టిడిపి నేతలు చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి, పాశం సునీల్‌కుమార్, కావ్య కృష్ణారెడ్డి, మాజీ ఎంఎల్‌ఎలు కంభం విజయ రామిరెడ్డి,పరసా రత్నం, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, సుబ్బానాయుడు, రాజా నాయుడు, డాక్టర్ శివప్రసాద్ ఉన్నారు.



ఇరిగేషన్ ప్రాజెక్టులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తున్న నారా చంద్రబాబునాయుడు


జిల్లాలోని ఇరిగేషన్ ప్రాజెక్టుల గురించి చంద్రబాబుకు వివరిస్తున్న సోమిరెడ్డిచంద్రమోహన్‌రెడ్డి

ప్రజా సమస్యల పరిష్కారం కోసమే

ప్రజా పోరు యాత్ర : సిపిఎం

ప్రజాశక్తి-నెల్లూరు :నగర నియోజకవర్గ పరిధిలో 28 డివిజన్ల పరిధిలోని ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించమని కోరేందుకు సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేది వరకు 'ప్రజా పోరు యాత్ర' నిర్వహిస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక 54వ డివిజన్ ప్రాంతంలోని భగత్‌సింగ్ కాలనీలో మొదటి రోజు ప్రజా పోరు యాత్రను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో 10 రోజుల పాటు ఈ యాత్ర నిర్వహిస్తామన్నారు. ఈ క్రమంలో సిపిఎం కార్యకర్తలు 28 డివిజన్లలోని ప్రతి ఇంటిని సందర్శించి సమస్యలను తెలుసుకుని కార్పొరేషన్ అధికారుల దృష్టికి , కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. భగత్‌సింగ్ కాలనీలో దాదాపుగా 500 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయన్నారు. వీరందరికీ తాము అధికారంలోకి వచ్చిన 6 నెలల్లో పట్టాలు పంపిణీ చేస్తామని ప్రస్తుత నగర ఎంఎల్‌ఎ అనిల్‌కుమార్ హామీ ఇచ్చారన్నారు. వైసిపి ప్రభుత్వ కాలం పూర్తి కావస్తున్నప్పటికీ ఒక్క కుటుంబానికి సైతం పట్టా పంపిణీ చేసిన దాఖలాలు లేవన్నారు. పెన్నా రివిట్ మెంట్ గోడకు శంకుస్థాపన చేసి రెండేళ్లవుతున్నా శిలాఫలకం మాత్రమే ఉందని, గోడ పనులు ప్రారంభించలేదన్నారు. టిడ్కో అపార్ట్‌మెంట్లలో ప్రజలు గుక్కెడు మంచినీళ్లు దొరక్క ఇబ్బందులు పడుతున్నారన్నారు. సిటీ నియోజకవర్గంలో ప్రజా సమస్యలు పరిష్కరించే అంతవరకు సిపిఎం పార్టీగా తమ పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు.కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, నగర కార్యదర్శి వర్గ సభ్యులు జి. నాగేశ్వరరావు, షేక్ మస్తాన్ బి, పి సూర్య నారాయణ, నగర కమిటీ సభ్యులు బి.పి నరసింహ,కత్తి పద్మ, మూలం ప్రసాద్,ఎన్ వి సుబ్బమ్మ, ఉడతా ప్రసాద్, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి జి శేషయ్య, నగర అధ్యక్ష,కార్యదర్శులు బొమ్మ శ్రీధర్, పి వేణు, స్థానిక శాఖా కార్యదర్శులు షేక్ జాఫర్, నక్క వెంకటేశ్వర్లు, మల్లీశ్వరి, అల్లంపాటి శ్రీనివాసులు రెడ్డి, చిరంజీవి, సంపూర్ణమ్మ పాల్గొన్నారు.


నగర నియోజకవర్గ పరిధిలో సాగుతున్న ప్రజా పోరు యాత్ర

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి -నెల్లూరు :నెల్లూరు రూరల్ ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి గారి సమక్షంలో 24వ డివిజన్, కల్లూరుపల్లి కి చెందిన వడ్లపూడి సుమన్ వారి మిత్రబందం టిడిపిలో చేరింది. ఆదివారం ఎంఎల్‌ఎ కార్యాయలంలో పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం మరియు గౌరవం కల్పిస్తావమన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని ప్రజలందరికి మనవి చేస్తున్నా వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ టిడిపికి ఓటు వేసి, నారా చంద్రబాబు నాయుడును రాష్ట్ర ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే అభివద్ధి, సంక్షేమం రెండు జరుగుతాయన్నారు.


టిడిపిలోకి ఆహ్వానిస్తున్న ఎంఎల్‌ఎ శ్రీధర్‌రెడ్డి

కొండ బిట్రగుంటలో దారుణం

ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు దారుణ హత్య

ప్రజాశక్తి-నెల్లూరు :బోగోలు మండలం, కొండబిట్రగుంట ప్రాంతంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు హత్యకు గురైన సమాచారం బయటకు రావడంతో ఆ ప్రాంత ప్రజలు భయాందోళనకు గురయ్యారు. మృతి చెందిన వారిలో ఇద్దరు మహిళలు, ఒకరు పురుషుడు ఉన్నారు. మృతుడు కృష్ణయ్య, కూతురు మౌనిక, అత్త శాంతమ్మలుగా గుర్తించారు. ఆస్తి వివాదం నేపథ్యంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు దారుణహత్యకు గురైనట్లు పలువురు భావిస్తున్నారు. బోగోలు మండలం కొండ బిట్రగుంటలో రెండు రోజుల కిందట ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురుని గుర్తు తెలియని వ్యక్తులు గృహంలోనే హత్య చేసి ఇంటికి తలుపులు వేసి పారిపోయారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని విచారణ చేపట్టారు. సమాచారం తెలుసుకున్న ఎస్‌పి డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి , బిట్రగుంట పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మీడియాతో ఎస్‌పి మాట్లాడుతూ ఆదివారం మధ్యాహ్నం మృతుల కుటుంబానికి చెందిన కొందరు వ్యక్తులు ఫోన్ చేసి తమకు సంబంధించిన వ్యక్తులు గత రెండు రోజుల నుంచి తాము ఫోన్ చేస్తే స్పందించడం లేదంటూ ఫిర్యాదు చేశారన్నారు. దీంతో తమ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారన్నారు. పోలీసుల విచారణలో ఒకే ఇంట్లో ముగ్గురు మృతదేహాలు ఉండటం గుర్తించారన్నారు. ఆ మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించామన్నారు. మూడు బృందాలను ఏర్పాటు చేసి కేసు దర్యాప్తును ప్రారంభించామన్నారు. స్థానికుల కథనం మేరకు కొండబిట్రగుంట ప్రాంతానికి చెందిన మందాడి మల్యాద్రి పెద్ద కుమారుడు మధుసూదన్ ఇటీవల అనారోగ్యంతో మతి చెందాడన్నారు. మరో నాలుగు రోజుల్లో మధుసూదన్ పెద్దకర్మ ఉండటంతో బంధువులంతా ఆదివారం మాల్యాద్రి ఇంటికి వచ్చారన్నారు. ఈక్రమంలో మాల్యాద్రి చిన్నకుమారుడు చంద్రమౌళికి తన వదిన మౌనికతో గొడవ జరిగిందన్నారు. ఆ కోణంలో విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


సంఘటనా స్థలంలో మృతదేహాలు

నేడు విఆర్‌ఎల ధర్నా

కందుకూరు : ఎపి గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం దశల వారి ఆందోళనలో భాగంగా ఈనెల 7,8 తేదీల్లో నెల్లూరు కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నా కార్యక్రమానికి మండలంలోని విఆర్‌ఎలు పాల్గొని జయప్రదం చేయాలని విఆర్‌ఎల సంఘం ప్రధాన కార్యదర్శి గుండాబత్తిన రమేష్ పేర్కొన్నారు. ఈ మేరకు వారు ఆదివారం ధర్నాకు అనుమతించాలని కోరుతూ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేవారు. కందుకూరు మండల విఆర్‌ఎ సంఘం అధ్యక్షుడు రామయ్య మండల వి ఆర్‌ఎలు పాల్గొన్నారు.


తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వైసిపి ఓటమి ఖాయం : ఇంటూరి

ప్రజాశక్తి-కందుకూకు : మహాశక్తి పథకం ప్రచారంలో భాగంగా కందుకూరు పట్టణంలోని 14, 17వ వార్డులో టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రచారంతోపాటు రచ్చబండ కార్యక్రమం ఆదివారం నిర్వహిం చారు. కందుకూరు నియోజవర్గంలోని పలు మండలాలకు చెందిన తెలుగు మహిళలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా మహాశక్తి పథకంలోని అంశాలను ఇంటూరి నాగేశ్వరరావు మహిళలకు వివరించారు. పట్టణ పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు వార్డు అధ్యక్షుడు దివి శ్రీనివాసరావు, ముచ్చు బ్రహ్మయ్య, నాయకులు రావి వెంకటేశ్వర్లు, రామలింగయ్య, ఉన్న కష్ణమోహన్, కాకుమాని మాల్యాద్రి, పి.బాలాజీ ,కందుకూరు పట్టణ మహిళ అధ్యక్షురాలు ముచ్చు రాజ్యలక్ష్మి, గుడ్లూరు మండల అధ్యక్షురాలు రమణమ్మ, కందుకూరు మండల అధ్యక్షురాలు మనం శైలజ, కందుకూరు పట్టణ ప్రధాన కార్యదర్శి కల్లూరి శైలజ, కంసాని మయూరి, దాక్షాయిని, మల్లవరపు సీత, తొట్టెంపూడి రాణి, ఎండ్లూరి ఎస్తేరమ్మ, రత్తమ్మ, రావి సరిత, షేక్ రసూల్ బి, కొత్తపేట పద్మ, బుజ్జమ్మ ఉన్నారు.



విరాళం అందజేత

కందుకూరు :అంకమ్మ తల్లి దేవస్థానం పునర్నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అమ్మవారి విగ్రహ పునః ప్రతిష్ఠ సెప్టెంబర్ 7న జరగనుంది. ఈ నేపథ్యంలో మద్దిశెట్టి యలమందయ్య భార్య సుశీలమ్మ జ్ఞాపకార్థం కుమారుడు వెంకటేశ్వర్లురూ 25,116 అమ్మవారికి కానుకగా ఎంఎల్‌ఎ మహీధర్‌రెడ్డి సమక్షంలో ఆదివారం అందజేశారు . అమ్మవారి బంగారు యంత్రం కోసం ఏల్చూరి కిషోర్ భార్య వెంకట సాయి మేఘన రూ 6,250 పి లక్ష్మీనారాయణ భార్య హైమ. 2 గ్రాముల బంగారం విలువ చేసే నగదు. రూ 12,501 చింతల పూడి మోహన్ రావు భార్య సుభాషిని. ఒక గ్రామ విలువచేసే. రూ6251 నగదు , చిత్తూరు వెంకటే శ్వర్లు భార్య అపర్ణ. 1 గ్రాము. విలువచేసే నగదు రూ 6250 అందజేశారు. పునర్నిర్మాణ కమిటీ సభ్యులు యెనిమిరెడ్డి వెంకటరెడ్డి , సూరం వేణుగోపాల్ రెడ్డి, మద్దిశెట్టి వెంకటేశ్వర్లు మురారి శెట్టి శ్రీకాంత్. ఉన్నారు.

బహిరంగ మార్కెట్ విలువ ప్రకారం

పరిహారం అందజేయాలి

ఎపి రైతు, వ్యవసాయ కార్మిక, కౌలు రైతు సంఘాలు డిమాండ్

ప్రజాశక్తి-నెల్లూరు :భారత్ మాల పేరుతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన రహదారుల నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం, బహిరంగ మార్కెట్ విలువను అనుసరించి నష్టపరిహారం అందజేయాలని ఎపి రైతు, వ్యవసాయ కార్మిక,కౌలు రైతు సంఘాలు డిమాండ్ చేశాయి. ఆదివారం నగరంలోని డాక్టర్ రామచంద్రారెడ్డి భవన్‌లో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పి. శ్రీరాములు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నలగడ్డ వెంకమరాజులు మాట్లాడుతూ భారతమాల, సాగర్‌మాల పేర్లతో జిల్లాలో రెండు జాతీయ రహదారుల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఈ రహదారుల నిర్మాణం కోసం జిల్లాలోని మర్రిపాడు మండలం నుంచి అనంతసాగరం, చేజర్ల , కలువాయి, పొదలకూరు, మనుబోలు, వెంకటాచలం, ముత్తుకూరు మండలాల్లో 32 గ్రామాల్లో 2 పంటలు సాగుబడి అయ్యే భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందన్నారు. ఈ క్రమంలో భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం నామ మాత్ర నష్టపరిహారం అందజే యడం దారుణమన్నారు. కౌలు రైతు సంఘం కార్యదర్శి తుళ్లూరు గోపాల్, వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి ఎం. పుల్లయ్యలు మాట్లాడుతూ ప్రజాఉపయోగం కోసం ప్రభుత్వం భూములు స్వాధీనం చేసుకొనే సమ యంలో భూ యజమానులకు నష్ట పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం 2013లో భూ సేకరణ చట్టాన్ని రూపొందిం చిందన్నారు .ఈ చట్టాన్ని అనుసరించి భూసేకరణ సమయంలో గ్రామీణ ప్రాంతాల్లో మార్కెట్ విలువకు నాలుగు రెట్లు అధికంగా, పట్టణ ప్రాంతంలో రెండు రెట్లు అధికంగా నష్టపరిహారం భూ యజమానికి చెల్లించాల న్నారు. అదే సమయంలో ప్రజాభిప్రాయాన్ని ప్రభుత్వం సేకరించాలన్నారు.అందుకు భిన్నంగా ప్రభుత్వం భూసేకరణ చేస్తుందని, భూములు కోల్పోతున్న రైతుల సమస్యను ప్రభుత్వం మరో మారు పరిశీలించి నష్టపరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నుంచి స్పందన రానిపక్షంలో రైతులందరినీ ఐక్యం చేసి కోల్పోతున్న భూములకు సరైన నష్టపరిహారం కోసం పోరాటం చేస్తామన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

ఆకట్టుకున్న వర్ణ చిత్రాలు

నెల్లూరు : రాష్ట్రంలో తొలిసారిగా ఆవాజ్ ఆధ్వర్యంలో 350 మంది స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రలతో కూడిన వర్ణ చిత్రాల ప్రదర్శనను ఏర్పాటు చేయడం అభినందనీయమని డాక్టర్ రామచంద్రారెడ్డి ప్రజా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బి.రాజేశ్వరరావు తెలిపారు. ఆదివారం జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఆవాజ్ నగర కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వాతంత్ర్య సమరయోధుల వర్ణ చిత్రపట ప్రదర్శనను ఆయన ప్రారం భించారు. ఈ సందర్భంగా బి రాజే శ్వరరావు మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాట చరి తను తెలుసు కోవాలంటే ఈ చిత్రపట ప్రదర్శన ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. స్వాతంత్ర్యోద్యమ నేతల గురించి తెలుసు కోవాలనే ప్రతి ఒక్కరూ ఈ వర్ణ చిత్రాల ప్రదర్శనను చూడాలని సూచించారు. ముఖ్య ంగా యువత, విద్యార్థులు చూసి విజ్ఞానాన్ని పెంచుకోవాలని ఆయన కోరారు. ఆవాజ్ జిల్లా కార్యదర్శి షేక్ రషీద్ మాట్లాడుతూ ఈ చిత్ర పట ప్రదర్శన 8వ తేది సాయంత్రం 7 గంటల వరకు ఉంటుందన్నారు. స్వాతంత్ర్యోద్యమ నేతలపై ప్రజలకు అవగాహన కోసం ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ చరిత్రకారులు సయ్యద్ నజీర్ అహ్మద్, కలర్ ఫోటోల రూప కర్త మహమ్మద్ గౌస్, న్యూ కాలేజీ రిటైర్డ్ ప్రొఫెసర్ షేక్ ఖాజా రసూల్,ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షులు సుభహాన్, ఆవాజ్ జిల్లా కార్యదర్శి రషీద్, జిల్లా అధ్యక్షుడు సయ్యద్ రఫీ, జిల్లా కమిటీ సభ్యులు రియాజ్ భాష, ఎస్‌ఎం భాషా నజీర్ భాష, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.


ప్రదర్శనను ప్రారంభిస్తున్న బి రాజేశ్వరరావు

దుస్తులు పంపిణీ

కందుకూరు: కందుకూరు శివారు ప్రాంతాల్లో ఉన్న పేదలకు దుస్తులు షైన్ ఫౌండేషన్ ఆదివారం పంపిణి చేసింది. కందుకూరు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఊరిబయట శివారు ప్రాంతాల్లో నివసిస్తున్న పేదలను గుర్తించి ఇళ్ళల్లో ఉన్న పాత దుస్తులు , కొత్త దుస్తులను సేకరించి వారికి దుస్తులు పంపిణీ చేశారు. ఫౌండేషన్ ప్రెసిడెంట్ రహీమ్ మాట్లాడారు. ఫౌండేషన్ ప్రతినిధులు ఉన్నారు.

సర్టిఫికెట్లు అందజేత

కందుకూరు :కందుకూరు కోటారెడ్డి నగర్, శ్రీ చైతన్య హైస్కూలు లో ఆదివారం నాసా స్పేస్ సెటిల్మెంట్ అవార్డును గత ఏడాది పాఠశాలలో నిర్వహించిన నాసా రాయాజ్ స్పేస్ కాలనీ ప్రాజెక్ట్ అవార్డును గెలుచుకుంది. విద్యార్థులు ప్రయోగాత్మకంగా చేసిన ప్రాజెక్టు జాతీయ స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచింది. ఎంపికైన విద్యార్థులను అర్‌ఐ అనిల్ కుమార్, కో-ఆర్డినేటర్ జి.శ్రీనివాసులు, ప్రధానోపా ధ్యాయులు బి.సురేష్, అకడమిక్ డీన్ జి.బ్రహ్మయ్య, నాసా ఇన్‌ఛార్జి రవి అభి నందించారు. మెమొంటోలు, సర్టిఫికెట్లు, పతకాలను అందచేశారు.

కొనసాగుతున్న ప్రజా పోరు యాత్ర

ప్రజాశక్తి -నెల్లూరు :రూరల్ నియోజకవర్గ పరిధిలో స్థానిక ప్రజా సమస్యల పరిష్కారానికి సిపిఎం రూరల్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజా పోరు యాత్ర ఐదో రోజుకు చేరింది. ఆదివారం స్థానిక కరెంట్ ఆఫీస్ సెంటర్ నుంచి ప్రజా పోరు యాత్రను సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం .మోహన్ రావు , జిల్లా కమిటీ సభ్యురాలు ఎస్‌కె రెహనా బేగం పార్టీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మోహన్‌రావు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 100 రోజుల్లో ధరల తగ్గిస్తామని, నిరుద్యోగ సమస్య పరిష్కరిస్తామని, అందులో భాగంగా ప్రతి ఏడాది రెండు కోట్లు ఉద్యోగాలు ఇస్తామని, ఒక్కొక్కరి అకౌంట్లో 15 లక్షలు వేస్తామని ,రాష్ట్రానికి ప్రత్యేక హెూదా కల్పిస్తామని, విభజన హామీల అమలు చేస్తామని ఇలా అనేక హామీలు చేశారన్నారు. ఇంతవరకు ఒక్క హామీ కూడా అమలుకు నోచుకోలేదన్నారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు ఎస్ కె రెహనా బేగం మాట్లాడుతూ బిజెపి పాలనలో మహిళలపై హింసా కాండ పెరిగిందన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలపై పన్నుల భారం పెరిగిం దన్నారు.ఇంటి పన్ను, చెత్త పన్ను పెరగడంతోపాటు కరెంట్ చార్జీలు 8సార్లు పెంచి ప్రజల నడ్డివిరిచారన్నారు. సిపిఎం రూరల్ కార్యదర్శి బత్తల కష్ణయ్య, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు అబ్దుల్ అజీజ్ మాట్లాడారు. పోరు యాత్ర కరెంట్ ఆఫీస్ నుంచి బయలుదేరి జిజిహెచ్ కొండాయపాలెం గేట్ ఎంజి మహల్ సెంటర్, బొల్లినేని హాస్పిటల్ సెంటర్, అంబేద్కర్ నగర్, క్రాంతి నగర్, రామనగర్ ప్రశాంతినగర్. 38వ డివిజన్లోని కెవిఆర్ పెట్రోల్ బంక్ ఎర్ర గడ్డల సంఘం అమరవీరుల భవనం పతే ఖాన్ పేట, అలంకార్ సెంటర్ ఇ రకాలమ్మ దేవాలయం సెంటర్ రాజీవ్ గహ కల్పన వరకు పోరు యాత్రను నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం కార్యదర్శివర్గ సభ్యులు కొండ ప్రసాద్ కిన్నెర కుమార్, రూరల్ కమిటీ సభ్యులు ఎస్‌కె శంషాద్, నందిపాటి మాలకొండయ్య,పిఎస్ బాబు, శాఖ కార్యదర్శులు మల్లికార్జున్, వై ఈశ్వరయ్య, వెంకీ, ఆటో రూరల్ అధ్యక్షులు కార్యదర్శి కె. శ్యాంసన్, ఎం సుధాకర్ జనార్ధన్, సుబ్బయ్య,ఎం.బాలయ్య, బి. ఏడుకొండలు, ఎస్‌కె గయా జ్.ఎం. గోపాల్ ఎస్.కె భాష,ఎస్‌కె షబ్బీర్ ఉన్నారు.



అజీజ్‌కు చంద్రబాబు పరామర్శ

కుటుంబ సభ్యులతో మాటా మంతి

ప్రజాశక్తి- నెల్లూరు ప్రతినిధి

టిడిపి పార్లమెంట్ ఇన్‌ఛార్జి అబ్దుల్ అజీజ్ ఇంటికెళ్లి టిడిపి అధినేత చంద్రబాబునాయుడు పరామర్శించారు. ఇటీవల కాలంలో కిడ్నీకి సంబంధించిన చికిత్స చేయించుకుని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న అజీజ్‌ను ఆదివారం హరనాథ పురం లోని ఆయన నివాసంలో చంద్రబాబు పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్తితి గురించి అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన కోలుకుని తిరిగి ప్రజా క్షేత్రంలోకి అడుగుపెట్టాలని ఆకాంక్షించారు. అబ్దుల్ అజీజ్ కుటుంబ సభ్యులతో సుమారు అరగంట సేపు చర్చించారు. వారి బాగోగులు తెలుసుకున్నారు. అజీజ్‌కు రాజకీయంగా ఏ మాత్రం గౌరవం తగ్గదని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. కుటుంబ సభ్యులతో కలిసి ఫొటో తీయించుకున్నారు. మత పెద్దలతో ప్రార్థనలో పాల్గొన్నారు. చంద్రబాబునాయుడు రాకతో ఆ ప్రాంతంలో సందడి నెలకొంది. ఆయన వెంట సీనియర్ నేత సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, మాజీ మంత్రి పి. పొంగూరు నారాయణ, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నేతలు పోలంరెడ్డి దినేష్ రెడ్డి, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, తాళ్లపాక అనురాధ, దొద్దపనేని రాజా నాయుడు తదితరులు ఉన్నారు. అనంతరం ఒంగోలు బయలుదేరి వెళ్లారు.


నారా చంద్రబాబునాయుడుతో అజీజ్ కుటుంబ సభ్యులు

రోడ్డు ప్రమాదంలో యాచకుడు మృతి

ప్రజాశక్తి-గుడ్లూరు : మండలం మోచర్ల దగ్గర జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొని స్థానికంగా ఉండే యాచకుడు దుర్మరణం చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మతదేహాన్ని స్వాధీనం చేసుకుని కందుకూరు పోస్టార్టం కోసం తరలించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రసాద్ రెడ్డి వెల్లడించారు.

'నారాయణ'లో తల్లిపాల వారోత్సవాలు

ప్రజాశక్తి-నెల్లూరు

నారాయణ ఆస్పత్రిలో చిన్నపిల్లల వ్యాధుల విభాగం, కాన్పులు, గర్భకోశ వ్యాధుల విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో తొలుత నర్సింగ్ సిబ్బంది ప్రార్థనా గీతాలాపన అనంతరం నారాయాణ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. శ్రీనివాసుల రెడ్డి నారాయణ హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి. హరిప్రసాద్ రెడ్డి లు జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం డాక్టర్ పి. శ్రీనివాసుల రెడ్డి మాట్లాడుతూ తల్లిపాలు త్రాగడం వలన రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. నారాయణ హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి. హరిప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ తల్లి బిడ్డకు జన్మనిచ్చిన తరువాత మొదటగా వచ్చే ముర్రుపాలు పట్టించడం ఎంతో ప్రాముఖ్యమన్నారు. నారాయణ ఆస్పత్రిలోని పిడియాట్రిక్ విభాగంలో బిడ్డకు అవసరమైన టీకాలను ఉచితంగా వేయడం జరుగుతుందని తెలిపారు. నారాయణ హాస్పిటల్ చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ ఆర్. సాంబశివారెడ్డి మాట్లాడుతూ చాలా మంది తల్లులు బిడ్డకు పాలు ఇస్తుంటే విరేచనాలు అవుతున్నాయని, వాంతులు అవుతున్నాయని, చిన్నచిన్న కారణాల వల్ల బిడ్డకు పాలు ఇవ్వడం ఆపేస్తుంటారన్నారు. ఇది సరికాదన్నారు. విరేచనాలు అవుతుంటే డాక్టర్ని సంప్రదించాలి తప్ప బిడ్డకు పాలు ఇవ్వడం మానకూడదు, ముఖ్యంగా తల్లులు మంచి పోషకాహారం తీసుకోవాలని సూచించారు.గైనకాలజీ వైద్యులు డావ నవ్య గారు మాట్లాడుతూ పాలిచ్చే తల్లులు సరైన పోషకాహారం తీసుకోవాలని తెలిపారు.. నారాయణ హాస్పిటల్ అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్. హరీష్ , గైనకాలజిస్ట్ డాక్టర్ సీతాలక్ష్మీ , అసిస్టెంట్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుప్రజ డాక్టర్ కె. మంజుప్రభ , హాస్పిటల్ ఏ.జి, ఎం శేఖర్రెడ్డి ఉన్నారు.


నారాయణ ఆస్పత్రిలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవ కార్యక్రమంలో వైద్యులు

ప్రతిపక్షాల సభలను అడ్డుకోవడం సిగ్గుచేటు



ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ప్రతిపక్షాల సభలను అడ్డుకోవడం సిగ్గుచేటు అని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జి.వి.సత్యనారాయణ పేర్కొన్నారు. ఆదివారం ఆత్మకూరు పట్టణంలో సిపిఐ మూడు రోజులపాటు జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆదివారం చివరి రోజు ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవివి సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతిపక్షాల తీరు వివాదాస్పదంగా ఉందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండు కూడా ప్రజల క్షేమం కోసం కాకుండా తమ సొంత క్షేమం కోసం మాత్రమే పనిచేస్తున్నాయని వ్యాఖ్యానించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న నిర్ణయాలు వ్యతిరేకిస్తూ 17వ తేదీ నుండి రాష్ట్రవ్యాప్తంగా బస్సు యాత్ర శ్రీకారం చుడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, జిల్లా సహాయ కార్యదర్శి మాలకొండయ్య, ఆత్మకూరు నియోజకవర్గం కార్యదర్శి మధు, జిల్లా కార్యవర్గ సభ్యులు నాగేంద్ర సాయి, తదితరులు హాజరయ్యారు.

వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : తక్కువ ఖర్చుతో అందించే వైద్యాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ ఎం.వి.రమణయ్య పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని జన విజ్ఞాన వేదిక మండల శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ జెట్టి శేషారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ వారి ద్వారా సుగర్, బిపి, మొదలగు వ్యాధులకు మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం వి రమణయ్య మాట్లాడుతూ పేద ప్రజల కోసం ఏర్పాటుచేసిన ఈ వైద్య శిబిరాన్ని పట్టణ, గ్రామీణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సుగర్ పరీక్ష రూ.25, ఇన్సులిన్ రూ.80, రెండు నెలకు సరిపడా మందులు రూ.200, బిపి పరీక్ష ఉచితం ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి, కామయ్య, హరికృష్ణ, మురళీకృష్ణ, లక్కు కృష్ణప్రసాద్, షేక్ సందాని, సాక్.హుస్సేన్, వేమా.పెంచలయ్య, రమేష్ బాబు, ఒంటేరు మల్లికార్జున, జెవివి నాయకులు, కార్యకర్తలు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు అనంత్, ఇబ్రహీం, ఆనందం, అంజి, ఆసిఫ్ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. 95మంది వ్యాధిగ్రస్తులు పాల్గొన్నారు. అనంతరం అక్టోబర్ 1వ తేదీన తిరిగి ఈ వైద్య శిబిరం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలియజేశారు.



మాట్లాడుతున్న ఎంవి రమణయ్య

కృష్ణబలిజలను బిసి-ఎగా మార్చాలి



ప్రజాశక్తి-కావలి : కృష్ణ బలిజలను బి.సి.-డిగా పరిగణించడం వల్ల వారు ఎంతగానో నష్టపోతున్నారని, వారిని బి.సి.-ఎగా మార్చేంతవరకు పోరాటం చేస్తారని, రాష్ట్ర కృష్ణ బలిజ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోలా అశోక్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక కృష్ణ బలిజ సంఘం ఏరియాలో సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం సందర్భంగా ఆయనతో పాటు, రాష్ట్ర కృష్ణ బలిజ, పూసల కార్పొరేషన్ చైర్మన్ కోలా భవాని మణికంఠ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కృష్ణ బలిజలను బిసి-ఎలుగా గుర్తించాలని కోరగా అందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి స్పందించి, తప్పక మారుస్తామని హామీనిచ్చారని తెలిపారు. కావలిలో కృష్ణ బలిజ సంఘం కమ్యూనిటీ భవన నిర్మాణం వేగవంతం చేయాలన్నారు. కులం పెద్దలు పూనుకుంటే భవన నిర్మాణం కుదిరేలా కూడా వస్తాయన్నారు. కోలా భవాని మణికంఠ మాట్లాడుతూ తన కార్పొరేషన్ ద్వారా కమ్యూనిటీ భవన నిర్మాణానికి రూ.5లక్షలు ఆర్థికసాయం అందించేందుకు కృషి చేస్తున్నారు. కృష్ణ బలిజ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాశం వెంకటేశ్వర రావు, కార్యదర్శి పాశం శేషగిరిరావు, ఉపాధ్యక్షులు అన్నం నాగబాబు, మెడికల్ కన్వీనర్ బత్తల ప్రసాదరావు, జిల్లా అధ్యక్షులు కావలి వెంకయ్య, కోశాధికారి పాశం రమణయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎర్రంరెడ్డి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి కమ్మిరెడ్డి రమణయ్య, ఉపాధ్యక్షులు పాశం చంద్రశేఖర్ ఎర్రంరెడ్డి గోపాల్ పట్టినారాయణ, హాజరయ్య, తదితరులున్నారు.

ప్రతిభ పురస్కారాలు అందజేత

ప్రజాశక్తి-ఉదయగిరి : ఉదయగిరిలో 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రతిభావంతులైన విద్యార్థులకు నాయీబ్రాహ్మణ ఎంప్లాయిస్ సొసైటీ ప్రతిభాపురస్కారాలను అందజేశారు. ఆదివారం నెల్లూరులో జరిగిన కార్యక్రమంలో ఉదయగిరి పట్టణానికి చెందిన రోహిత్ 538, జయశ్రీ 962 మార్కులతో జరిగిన ఇంటర్మీడియట్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా వారికి నాయీబ్రాహ్మణ ఎంప్లాయిస్ సొసైటీ వారి ద్వారా విద్యార్థిని విద్యార్థులకు ప్రశంసాపత్రంతో పాటు, ఒక్కొక్కరికి రూ.2వేలు ప్రోత్సాహక నగదును అందించి అభినందించారు.

దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : స్థానిక బీసీ బాలుర వసతి గృహం-1లో ఉన్న 100 మంది బాలురకు సహరా ఎడ్యుకేషనల్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ వారి ఆధ్వర్యంలో ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డిప్యూటీ కలెక్టర్ సివిల్ సప్లయి విజిలెన్స్ విజయసుధాకర్ మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు పేదవాళ్లు కాబట్టి ప్రభుత్వ పాఠశాలలో, రాష్ట్ర బీసీ హాస్టల్లో చేర్చి చదివిస్తున్నారని తెలిపారు. పుచ్చల్ల రాధమ్మ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు పుచ్చల్ల సతీష్ కుమార్ రెడ్డి సహారా ఎడ్యుకేషనల్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ వారికి దుప్పట్లు ఇప్పించారని తెలిపారు. సొసైటీ సభ్యులు పటాన్ రహమతుల్లా ఖాన్, సిబ్బంది పాల్గొన్నారు.

సర్పంచ్ చెక్‌పవర్ రద్దు చేయడం బాధాకరం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : అప్పారావుపాలెం గ్రామపంచాయతీ సర్పంచ్ సోమా కుమారి చెక్ పవర్ రద్దు చేయడం ఎంతో బాధాకరమని నెల్లూరు పార్లమెంట్ ఎస్‌సిసెల్ అధ్యక్షుడు కాకి ప్రసాద్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి దామా పెంచలయ్య తీవ్రంగా ఖండించారు. ఆదివారం మండలంలోని అప్పారావుపాలెం గ్రామంలో సమావేశం నిర్వహించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం ఎస్సి, ఎస్‌టిల అభివృద్ధికి దోహదం చేస్తున్నామని చెబుతూనే అప్పారావుపాలెం సర్పంచ్ ఎస్టీ మహిళ సోమకుమారిపై వైసిపి నాయకులు జెడ్పిటిసి, ఎంపిటిసి, జెడ్పిటిసి భర్త కుటుంబ సభ్యులు వార్డు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ పంచాయతీ తీర్మానం ఆమోదించని బిల్లులను పాస్ చేయడానికి గ్రామ సర్పంచి సహకరించకపోవడంతో ఆమెను మానసికంగా వేధిస్తూ ఆ కారణంగా కొన్ని కారణాలు చూపించి రాజకీయ ఒత్తిళ్లతో వైసిపి నాయకులు గిరిజన మహిళ చెక్ పవర్ రద్దు చేయడం దుర్మార్గమని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు కొండా మల్లికార్జున నాయుడు, పెంచలనాయుడు, ఆత్మకూరు మండల ఎస్‌సిసెల్ అధ్యక్షుడు చిన్న కొండయ్య, టౌన్ అధ్యక్షులు ఉదయగిరి సుధాకర్, వద్దిర సంపాం కన్వీనర్ మాల్యాద్రి, ఆర్.పుల్లయ్య, సిహెచ్ సునీల్‌కుమార్, భగవాన్, మహేంద్ర, పలువురు పాల్గొన్నారు.

ఎస్‌సి వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

ప్రజాశక్తి- జలదంకి : షెడ్యూల్ కులాల వర్గీకరణకు ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్‌సి వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఎంఆర్‌పిఎస్ జిల్లా ఇన్‌ఛార్జి సూరిపోగు వాసు దేవరావు మాదిగ, జిల్లా కన్వీనర్ పందిటి అంబేద్కర్ మాదిగ డిమాండ్ చేశారు. జలదంకిలోని ఎస్‌సి కాలనీలో ఆదివారం ఎంఆర్‌పిఎస్ సీనియర్ నాయకులు గోచిపాతల వెంకటేశ్వర్లు మాదిగ అధ్యక్షతన హైదరాబాద్ కార్యక్రమంపై సమావేశాన్ని నిర్వహించారు. ఎస్‌సి వర్గీకరణ లక్ష్యసాధనకు ఆగస్టు మూడో వారంలో జరగబోయే మాదిగల విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో ఎంఐఎస్ జిల్లా ఉపాధ్యక్షులు రావినూతల చినరాముడు, ఎంఆర్‌పిఎస్ నాయకులు చెరుకూరి వెంకటేశ్వర్లు మాదిగ, పందిపల్లి మాదవ, కావలి శ్రీనివాసులు, కెవిపిఎస్ నాయకులు అంథోని, మనోజ్, డి.శ్రీనివాసులు, ఒంగోలు సాంసన్, రాజేంద్ర, పందిటి జాని, పి.ప్రవీణ్ మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్లు బహూకరణ



ప్రజాశక్తి-నెల్లూరు : నెల్లూరు రూరల్ శాంతినగర్‌లోని బట్వాడిపాలెం సెంటర్‌లో ఉన్న ఎస్‌సి గురుకుల హాస్టల్‌కు రూ.30వేల సీలింగ్ ఫ్యాన్లను బహూకరించారు. ఆదర్శ హాస్టల్ బాలికలకు ప్రాథమిక వైసిపి సేవాదళ్ అధ్యక్షులు మాతం సుధీంకుమార్‌రెడ్డి ప్రారంభోత్సవం చేయించారు. గురుకుల బాలికల పాఠశాలలో నీళ్ల కొరత, డ్రైనేజీ సమస్య ఉందని తెలుపగా గతంలో తన మిత్రుడి సహాయంతో లక్ష రూపాయలు ఖర్చు చేసి నీటి వసతి కల్పించి డ్రైనేజీ సమస్యను కూడా తీర్చారు. ఆ బాలికలు ఎక్కువ వెళ్ళిపోవడంతో హాస్టల్‌లో విద్యార్థులు తమకు సీలింగ్ ఫ్యాన్లు లేవు కావున సీలింగ్ ఫ్యాన్లు స్కూల్లో వేయించాలని కోరగా ఆయన సొంత నిధులతో రూ.30 వేలు విలువచేసే ఫ్యాన్లను బాలికల హాస్టల్‌కు బహూకరించారు.

14వ వార్డులో 'జనం కోసం జనసేన'

ప్రజాశక్తి-కావలి : కావలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి అళహరి సుధాకర్ అధ్యక్షతన, జిల్లా కార్యదర్శి సమ్మెట వెంకటసుబ్బయ్య పర్యవేక్షణలో టౌన్ ప్రెసిడెంట్ పొట్లా సాయి ఆధ్వర్యంలో 14వ వార్డు ఇన్‌ఛార్జి, పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ అధ్యక్షుడు ఆలా శ్రీనాథ్ సమక్షంలో 14వ వార్డులో 'జనం కోసం జనసేన' కార్యక్రమాన్ని నిర్వహించారు. మన్నెపల్లి రిషిక్, శరణ్, తేజ, శరత్, సతీష్, ఆగస్టిన్, సుధీర్, మన్సూర్, నాగార్జున, రామ, ప్రవీణ్, రెడ్డి సురేష్, మాధవ్, సతీష్, ఆలా, కలేషా, వంశీ, మహేంద్ర, జనసైనికులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనపై ప్రధాని మౌనం వీడాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

మణిపూర్‌లో జరుగుతున్న హింసకాండను నియంత్రించాలని ఆత్మకూరు వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు ఆధ్వర్యంలో ఆత్మకూరు ఆర్‌టిసి డిపో వద్ద నుండి మున్సిపల్ బస్టాండ్ వరకు భారీ శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా న్యాయవాది శేషారెడ్డి మాట్లాడుతూ భారతీయులంటే లౌకికవాదమే భారతీయులంటే ప్రజాస్వామ్యమే భారతీయులంటే కలిసి నెలసి జీవించడమే అని అన్నారు. భారతదేశంలోని లౌకిక వాదాన్ని, మత సామరస్యాన్ని కాపాడుకోవడానికి మరోసారి మనమందరం పునరంకితం అవ్వాలని పిలుపునిచ్చారు. సిపిఎం పట్టణ కార్యదర్శి డేవిడ్ రాజు మాట్లాడుతూ భారతదేశ ప్రయోజనాల కోసం ప్రాణాలైనా అర్పిస్తామే తప్ప ఈ భారతదేశ దేశాన్ని ముక్కలు కానివ్వమని అన్నారు రాజ్యాంగాన్ని కాపాడే ప్రతి పౌరుడిని కలుపుకొని ఈ దేశాన్ని కాపాడుకుంటామన్నారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గంటా లక్ష్మీపతి మాట్లాడుతూ ఈ దేశంలో కార్పొరేట్ శక్తులు బలపడాల పేదలు వారి చెప్పు చేతుల్లో ఉండాలని దురుద్దేశంతో ఇలటి చర్యలకు పాల్పడుతున్నారని ఇలాంటి ఆలోచనలు మానుకోవాలన్నారు. మణిపూర్ హింసకాండను ఆపేందుకు తక్షణమే భారత ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు ఆత్మకూరు నాగయ్య, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ సందాని, సిపిఎం నాయకులు ఆళ్ళ హజరత్తయ్య, వాగాల శ్రీహరి, సాలారుద్దీన్ మహబూబ్ బాషా, సాదిక్ హుస్సేన్, డివైఎఫ్ఐ నాయకులు నందా శీను, రమణయ్య, ఐద్వా నాయకురాలు గుల్జర్ బేగం, కొండా లక్ష్మమ్మ, రమణమ్మ, పద్మ, సుమతి, ప్రజా సంఘాల నాయకులు సిద్ధం పెంచల నరసయ్య, పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేశారు. ముందుగా గద్దర్ మృతికి వామపక్ష పార్టీలు ప్రజాసంఘాల నాయకులు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

గిరిజన మహిళపై దాడి

- నిందితుడిపై కేసు నమోదు చేసిన పోలీసులు

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

గిరిజన మహిళను బంధించి దాడి చేసిన ఘటన మండలంలోని మైపాడు గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి మేరకు.. మైపాడు గ్రామానికి చెందిన గంపల అనిల్ అనే వ్యక్తి రొయ్యల గుంతలపై గత మూడేళ్లుగా ఉంటున్న రాపూరుకు చెందిన వేటగిరి రమణమ్మను విచక్షణారహితంగా కొట్టి శనివారం రాత్రి తన గృహంలోని బంధించాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన ఇందుకూరుపేట ఎస్ఐ రాజకుమార్ సంఘటన స్థలానికి చేరుకుని బంధీగా ఉన్న బాధితురాలను విడిపించి వివరాలు సేకరించి నిందితుడు అనిల్‌ను పోలీస్ స్టేషన్‌కు, బాధితురాలు రమణమ్మను స్థానిక ఇందుకూరు పేట పిహెచ్‌సికి తరలించారు. రూరల్ డిఎస్‌పి వీరాంజనేయులు రెడ్డి విచారణ చేపట్టి విలేకరుల సమావేశం నిర్వహించారు. డిఎస్‌పి వివరాల మేరకు.. గంపల అనిల్ వివాహేతర సంబంధాన్ని తన భార్యకు చెప్పడంతో కోపంలో రగిలిన అనిల్ గిరిజన మహిళ రవణమ్మను ఇంటికి పిలిచి విషక్షానా రహితం గా దాడి చేశాడని తెలిపారు. సదరు నిందితుడి పై ఎస్‌సి ఎస్‌టి అట్రాసిటీ కేసు, 307 కేసులు నమోదు చేసినట్లు డి.ఎస్.పి వీరాంజనేయరెడ్డి తెలిపారు. ఈ విలేకర్ల సమావేశంలో కొవ్వూరు సిఐ రామకృష్ణారెడ్డి, ఎస్ఐ రాజ్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

మోపిదేవి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - కావలి



స్థానిక శాంతినగర్‌లో వైసిపి నాయకులు, రాష్ట్ర కృష్ణ బలిజ సంఘం రాష్ట్ర కార్యదర్శి పాశం శేషగిరిరావు నాయకత్వంలో రాష్ట్ర కృష్ణ బలిజ, పూసల కార్పొరేషన్ చైర్మన్ కోలా భవాని ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్ర మంత్రి మోపిదేవి వెంకట రమణ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జన్మదిన కేక్‌ను కత్తిరించారు. నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భవాని మాట్లాడుతూ తన రాజకీయ గురువు, రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణ జన్మదిన వేడుకలను నెల్లూరు జిల్లా కావలి పట్టణం కృష్ణ బలిజ సంఘీయులతో కలిసి నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. తన రాజకీయ ఎదుగుదలకు ఎంతగానో సహకరించిన మోపిదేవి వెంకటరమణ రానున్న 2024 ఎన్నికల్లో అత్యధిక ఓట్ల మెజారిటీతో గెలిచి, మంత్రి పదవి చేపట్టాలని కోరుతున్నానన్నారు. కార్యక్రమంలో కష్ణ బలిజసంఘం రాష్ట్ర నాయకులు కోలా మణికంఠ, కృష్ణ బలిజ సంఘం నాయకులు, వైసిపి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

గద్దర్ మరణం తీరని లోటు : జెవివి

ప్రజాశక్తి-కావలి

ప్రజాఉద్యమ చరిత్రలో తనదంటూ ఒక బాటను, పాటను నిల్పుకుని, కలం, గళం ఆయుధాలుగా మలచుకుని, సరికొత్త సాంస్కృతిక వేదికపై విస్తృత ప్రచారం చేస్తూ దశాబ్దాలుగా ప్రజాజీవనం సాగించిన సాంస్కృతిక ఉద్యమకారుడు, ప్రజానౌక గద్దర్ ఆదివారం మరణించడం ప్రజా సాంస్కృతిక ఉద్యమానికి తీరనిలోటుగా జెవివి అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. భూమికోసం, భుక్తికోసం, పేదల విముక్తి కోసం ప్రజానౌకగా మారిన గద్దర్ ఇచ్చిన పిలుపును అందుకుని యువతరం ముందుకు కదలాలని పిలుపునిచ్చారు. కావలి జనవిజ్ఞాన వేదిక అని అయన తన ప్రకటనలో ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని వ్యక్తం చేశారు.

ప్రజాశక్తి-కోవూరు : ప్రజా గాయకుడు, తెలంగాణా విప్లవయోధుడు గద్దర్ ఆదివారం మృతి చెందారని, ఆయన మృతికి ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి గండవరపు శేషయ్య సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ గద్దర్ మరణ వార్త తెలియగానే దిగ్భ్రాంతికి గురయ్యానని తెలిపారు. ఆయన వినిపించిన విప్లవ పాటలు శ్రామిక కార్మిక వర్గం ఎప్పటికీ మర్చిపోరని ఆయనకు ప్రజానాట్య మండలి జిల్లా కమిటీ తరపున నివాళులర్పిస్తున్నామని తెలిపారు.

ప్రజాశక్తి-బిట్రగుంట : ప్రజాగాయకుడు గద్దర్ మృతికి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేష్ బాబు సంతాపం తెలిపారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతకొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం కన్నుమూశారు.

దోపిడీలకు, దౌర్జన్యాలకు కేరాఫ్ 'ఎపి'

ప్రజాశక్తి-కావలి

రాష్ట్రంలో దోపిడీలకు, దౌర్జన్యాలకు కేరాఫ్ అడ్రస్ రాష్ట్ర ప్రభుత్వం నిలుస్తుందని కావలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బానాయుడు అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రాష్ట్రంలోని ఇరిగేషన్ ప్రాజెక్టుల అధ్వాన పరిస్థితిని పరిశీలిస్తున్న నేపథ్యంలో పుంగనూరులో జరిగిన ఘటన వైసిపి నీచ రాజకీయాలకు నిదర్శనమన్నారు. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు నాయుడును పుంగనూరులో అడ్డుకోవడం పెద్దిరెడ్డి దిగజారుడుతనాన్ని తెలియజేస్తుందన్నారు. పుంగనూరు పాకిస్తాన్ అయితే కాదుగా అని ప్రశ్నించారు. దౌర్జన్యాలకు భయపడే వ్యక్తి చంద్రబాబు కాదని, కేవలం పెద్దిరెడ్డి దోపిడీలు ఎక్కడ బయటపడతాయోనని ఇటువంటి చర్యలు చేపట్టడం సరికాదని తెలిపారు. టిడిపి అధికారంలోకి వచ్చిన తరువాత దౌర్జన్యాలకు, దోపిడీలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన వారికి బుద్ధి చెబుతామని హెచ్చరించారు. తదుపరి ప్రజా గాయకుడు గద్దర్ ఆకస్మిక మరణానికి చింతిస్తూ కాసేపు సంతాపం పాటించారు. సమావేశంలో రాష్ట్ర పార్టీ కార్యదర్శి మొగిలి కల్లయ్య, జిల్లా అధికార ప్రతినిధి ఎగూరి చంద్రశేఖర్, జిల్లా తెలుగు రైతు ఉపాధ్యక్షులు బొట్లగుంట శ్రీహరి నాయుడు, రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ మస్తాన్, జిల్లా మైనారిటీ సెల్ ఉపాధ్యక్షులు షేక్ రఫీ అహ్మద్, కోట రమేష్, అబ్దుల్ రహీం, శానం హరి, ప్రళయకావేరి మల్లి కార్జున, ఉప్పాల మాలకొండయ్య, కాంద్ర సతీష్, పట్టణ పార్టీ మహిళా నేతలు ద్రోణాదుల వాసంతి, అమర జ్యోతి, తదితర నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాలేపాటి సుబ్బానాయుడు

రిజర్వాయర్‌కు నిధులు మంజూరు చేయాలి

ప్రజాశక్తి-ఉదయగిరి

టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబును ప్రభుత్వం రాగానే చెంచురామయ్య రిజర్వాయర్‌కు నిధులు మంజూరు చేయాలని మాజీ జెడ్‌పి చైర్మన్ టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చెంచల బాబు యాదవ్ కోరారు. ఆదివారం నెల్లూరులోని కస్తూరి గార్డెన్స్‌లో ప్రాజెక్టుల సందర్శన కార్యక్రమానికి విచ్చేసిన సందర్భంగా చంద్రబాబును ఆయన కలిశారు. నియోజకవర్గంలో ఉన్న ఏకైక మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టు గండిపాలెం చెంచురామయ్య రిజర్వాయర్ నిధుల కొరతతో రైతులకు చివరి ఆయకట్టు వరకు నీరు అందడం లేదన్నారు. కాలువల పూడికతీతలకు కూడా ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం లేదని తెలిపారు. ఉదయగిరి, వరికుంటపాడు మండలాల్లోని 19 గ్రామాలకు తాగునీరు, 20 వేల ఎకరాలకు సాగునీరు అందించే చెంచురామయ్య సాగర్ రిజర్వాయర్ నిధుల కొరత వల్ల రైతులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రాజెక్టు చుట్టూ ముళ్ల చెట్లు కమ్మిఉన్నాయని టిడిపి ప్రభుత్వం అకారం చేపట్టిన తర్వాత చెంచు రామయ్య రిజర్వాయర్‌ను పూర్తిస్థాయిలో నిధులు మంజూరు చేసి చివరి ఆయకట్టు వరకు రైతులకు నీరు అంంచవలసిన అవసరం ఎంతైనా ఉందని వివరించి ప్రాజెక్టు సంబంధించిన చిత్రాలను చంద్రబాబుకు అందజేశారు.



చంద్రబాబుతో చెంచలబాబుయాదవ్

'అమ్మఒడి' నగదు కాజేసిన వలంటీర్

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని నాగినేనిగుంట గ్రామానికి చెందిన వలంటీర్ ఖాసీంపీరా తమ చేతివాటం ప్రదర్శించి అమ్మఒడి నగదును కాజేశారు. గ్రామానికి చెందిన హుస్సేనమ్మ దగ్గర బ్యాంక్ మొబైల్ యాప్ ద్వారా వేలుముద్రలు తీసుకొని లబ్ధిదారుఖాతాలో జమ అయిన అమ్మఒడి నగదు రూ.10వేలను వలంటీర్ అకౌంట్లోకి మళ్లించారు. లబ్ధిదారు బ్యాంకుకు వెళ్లి చూడగా ఆమె అకౌంట్‌లో నగదు లేకపోవడంతో వలంటీరును అడుగగా బెదిరింపులకు గాడని ఆమె వాపోయింది.

వామ్మో..గ్రామసింహాలు

ప్రజాశక్తి-కోవూరు



మాట్లాడుతున్న బాధితురాలు రాజ్యలక్ష్మీ

పట్టణంలోని గ్రామ సింహాలు విచ్చలవిడిగా ఉండడంతో ప్రజలు వామ్మో.. అంటూ భయాందో ళనకు గురవున్నారు. స్థానిక తాలూకా ఆఫీస్ నుంచి స్టౌబీడీ కాలనీ రోడ్డు వరకు గ్రామ సింహాలు ఎక్కువగా ఉండడంతో ఇబ్బందులకు గురవుతున్నామని స్థానికులు తెలియజేస్తున్నారు. వీటి వల్ల పాదచారులు, ద్విచక్ర వాహనదారులు కూడా ఇబ్బందులకు గురవుతున్నారని ప్రజలు పేర్కొంటున్నారు. ఆ దారిన వెళ్లాలంటేనే హడలు తున్నట్లు తెలియజేస్తున్నారు. వీటిని దూర ప్రాంతాలకు తరలించాలని కోరుతున్నట్లు పట్టణ ప్రజలు అధికారులు కోరుతున్నారు. ఈ మేరకు గవర్నమెంట్ హాస్పిటల్ సిబ్బంది అప్పల రాజ్యలక్ష్మీ మాట్లాడుతూ బైక్‌పై వెళుతుంటే తనను కుక్క కరిచింది. సంబంధిత అధికారులు వీటిని దూర ప్రాంతాలకు తరలించాలని కోరుతున్నామన్నారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి-వరికుంటపాడు



మండలంలోని తిమ్మరెడ్డి పల్లి ఉన్నత పాఠశాలలో తెలుగు పండితుడుగా పని చేస్తున్న వల్లపుశెట్టి సుబ్బారావు (52) ఆదివారం ఉదయం పామూరులోని తన నివాసంలో గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడికి భార్య, నలుగురు పిల్లలున్నారు. మృతుడి మండలంలోని తోటలచేరువుపల్లి కాగా ప్రస్తుతం ప్రకాశం జిల్లా పామూరులో గృహాన్ని నిర్మించుకొని అక్కడే ఉంటున్నారు. ఉపాధ్యాయుడు మృతి చెందడంపై తోటిఉపాధ్యాయులు, పలువురు సిఐటియు నాయకులు ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

'కాకర్ల' ఆధ్వర్యంలో చేయూత

ప్రజాశక్తి-సీతారామపురం

పది సంవత్సరాల క్రితం జరిగిన ఓ ప్రమాదంలో మండలంలోని చిన్ననాగంపల్లి పంచాయతీకి చెందిన షేక్ ఖాజావలి అనే ఓ తాపీ మేస్త్రీకి ఆదివారం కాకర్ల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందించి చేయూతనిచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రమాదంలో కాళ్లు విరిగి ఆపరేషన్ చేసిన తరువాత ఆరోగ్యం కుదుట పడిన తర్వాత తన కాళ్లలో అమర్చిన రాడ్డును బయటకు తీసే ఆపరేషన్ చెయించుకోవడానికి ఆర్థిక స్థోమత లేక, ఏ పనికి వెళ్లలేక తెలిసిన వారందరినీ సహాయం కోసం సంప్రదించి ఫలితం లేకపోయిందన్నారు. నిస్సహాయ స్థితిలో ఉన్న విషయాన్ని కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు ఇటీవల కాకర్ల ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన వాలీబాల్ టోర్నమెంట్‌కు బహుమతులను అందించడానికి వచ్చిన కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ అధినేత నియోజకవర్గం టిడిపి నాయకుడు కాకర్ల సురేష్ దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించి కిమ్స్ హాస్పిటల్‌లో డాక్టర్‌తో మాట్లాడి రూ.40 వేలతో అతనికి ఆపరేషన్ చేయించారు. ఈ విషయంపై బాధితుడు, కుటుంబసభ్యులు ఉదయగిరి నియోజక టిడిపి నాయకులు కాకర్ల సురేష్‌కు ఎప్పుడూ రుణపడి ఉంటామని, ఇటువంటి నాయకుడు ఉదయగిరి నియోజకవర్గం ప్రజలు కోసం రావడం నిజంగా అదృష్టమని తెలిపారు.

పెన్నానదిలో విద్యార్థి గల్లంతు

ప్రజాశక్తి-సంగం

మండలంలోని కోలగట్ల గ్రామంలో నాగవరపమ్మ గుడి సమీపం లోని పెన్నానదిలో సంగంకు చెందిన మనోజ్‌కుమార్ అనే విద్యార్థి గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు గాలింపు చర్యలు చేపడుతున్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-కావలి : అద్వి ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్నేహితులు దినోత్సవ సందర్భంగా ఆదివారం మున్సిపల్ స్కూల్, వైకుంటపురంలో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కావలి డిఎస్‌పి వెంకట రమణ మాట్లాడుతూ యువత ఇలా ముందుకు వచ్చి ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు అద్వి ఫౌండేషన్ సభ్యులందరిని అభినందించారు. అద్వి ఫౌండేషన్ వ్యవస్థాపకులు బెజవాడ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ స్నేహితుల దినోత్సవ సందర్భంగా నిర్వహించిన ఈ ఉచిత మెగా వైద్య శిబిరానికి విచ్చేసిన డాక్టర్ రేవంత్, డాక్టర్ రమ్య, డాక్టర్ భారతి, డాక్టర్ దినకరన్, ఒప్టిమెట్రిస్ట్ మోహన్‌లకు 150మంది పైగా ప్రజలకు వైద్యం అందించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ రవిప్రకాష్, ఫౌండేషన్ సభ్యులు యోగానంద, బాబి, విజయ్, అడ్వకేట్ అభిసాగర్, లోకేష్, సుబ్బయ్య, ప్రవళిక, మనోజ్, చరణ్, శ్రీకాంత్, సాయి, శ్రీను, రఘు, తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి



ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

బట్టేపాడు ప్రాథమిక సహకార సంఘం పరిధిలోని రైతులకు అందుబాటులో ఉండి వారికి అవసరమైన రైతు రుణాలు ఎరువులు సకాలంలో అందించే విధంగా కృషి చేస్తానని బట్టేపాడు సొసైటీ చైర్మన్ బొమ్మిరెడ్డి రవికుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని బట్టేపాడు సొసైటీ కార్యాలయం వద్ద నూతన చైర్మన్ బొమ్మిరెడ్డి రవికుమార్ రెడ్డి, కమిటీ సభ్యులుగా బొమ్మిరెడ్డి గోపాల్‌రెడ్డి, చల్లా వెంకటసుబ్బారెడ్డి ప్రమాణస్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆత్మకూరు ఎంపిపి కేత వేణుగోపాల్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో ఎంపిపి మాట్లాడుతూ వైసిపిలో కష్టపడిన ప్రతి ఒక్కరికి గుర్తింపు ఇచ్చి వారికి న్యాయం జరుగుతుందన్నారు. ఆత్మకూరు మున్సిపల్ వైస్‌చైర్మన్ డాక్టర్ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ ఎంఎల్ఏ మేకపాటి విక్రమ్‌రెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో బట్టేపాడులో ఇంటింటికి తిరిగి వారి సమస్యలను తెలుసుకొని సమస్యలు పరిష్కరిస్తున్నారని తెలిపారు. అందువల్ల గ్రామంలో ఎంఎల్ఏపై ప్రజలు ప్రత్యేక అభిమానం చెబుతున్నారన్నారు. చైర్మన్‌గా బాధ్యతగా స్వీకరించిన రవికుమార్ రెడ్డిని, ఎంపిపిని గజమాలతో సత్కరించారు. ఆత్మకూరు సిండికేట్ ఫార్మర్ సొసైటీ చైర్మన్ సాన వేణుగోపాల్ రెడ్డి, మాజీ సిండికేట్ ఫార్మర్ సొసైటీ చైర్మన్ నాగులపాటి ప్రతాప్ రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్, సర్పంచ్ చెరుకూరు చిన్నచెంచయ్య, పెమ్మసాని శ్రీనివాస్ నాయుడు, మాధవరెడ్డి, తదితరులున్నారు.

యోగా పోటీలో హేమితకు బహుమతి

ప్రజాశక్తి-నెల్లూరు



తమిళనాడు రాష్ట్రం గుమ్మడి పూడిలోని కైరాలి యోగా విద్యపీఠం వారు ఆదివారం నిర్వహించిన 17వ యోగా ప్రదర్శన పోటీలలో నెల్లూరు ప్రశాంతినగర్ బ్రహ్మానందపురంలోని అవెన్యూస్ సీనియర్ సెకండరీ స్కూల్ 7 ప్రగతి విద్యార్థిని హేమిత మూడవ బహుమతి సాధించింది. కార్యక్రమంలో హేమిత మూడో బహుమతి సాధించడంపై స్కూల్ యాజమాన్యం, స్కూల్ కస్పాండెంట్ పెనుబల్లి కృష్ణచైతన్య, ప్రిన్సిపాల్ నిరాప్రసాద్ తమ హర్షాన్ని తెలియజేసి హేమితను అభినందించారు. అవెన్యూ స్కూల్ సీనియర్ సెకండరీ స్కూల్ యోగా ట్రైనర్ పద్మావతి కూడా అభినందించారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం స్కూల్ అహర్నిశలు వారికి అన్ని విధాలుగా తోడ్పాటు అందిస్తామని స్కూల్ కరస్పాండెంట్ తెలియజేశారు.

జిఐఎస్‌తో విద్యుత్తు సమస్యలకు పరిష్కారం

- ఎస్ఇ వెంకటసుబ్బయ్య

ప్రజాశక్తి-నెల్లూరు

ప్రజలకు నిరంతరం విద్యుత్తు సరఫరా చేసేందుకు దక్షిణ ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ 'జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టం' (జిఐఎస్) టెక్నాలజీని రూపొందించింది. ఈ టెక్నాలజీని వినియోగించి వ్యవసాయ విద్యుత్తు సర్వీసులకు జియో ట్యాగింగ్ చేయడమే కాకుండా విద్యుత్తు సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా ఎపిఎస్‌పిడిసిఎల్ అడుగులు వేస్తోంది. విద్యుత్తు సమస్యల పరిష్కారానికి ఎటువంటి చర్యలు తీసుకుంటుందో ఎస్ఇ వెంకటసుబ్బయ్య మాటల్లో..



ప్రశ్న. దక్షిణప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జిఐఎస్ (జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్) టెక్నాలజీ పని ఎలా ఉంటుంది..?

జవాబు. ఆంధ్రప్రదేశ్ దక్షిణప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ప్రతిష్టాత్మకంగా రూపొందించిన జిఐఎస్ (జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టం) అనే వెబ్‌సైట్ ద్వారా కొత్త టెక్నాలజీని రూపొందించింది. ఈ టెక్నాలజీ ద్వారా జిల్లాలోని వ్యవసాయ విద్యుత్ సర్వీసులను జియో ట్యాగింగ్ చేస్తాం. ఆ విధంగా చేయడం ద్వారా విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించే దిశగా ఎపిఎస్‌డిసిఎల్ అడుగులు వేస్తుంది. ముందుగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, మీటర్లు, విద్యుత్ స్తంభాలను క్యూఆర్ కోడ్ స్టిక్కర్లు అంటించి వాటిని స్కానింగ్ చేయడం ద్వారా ఆ ప్రాంతం నుంచి విద్యుత్ సిబ్బంది లైట్‌యాప్ ద్వారా రైతుకు సంబంధించిన విద్యుత్ సర్వీసు వివరాలు అప్‌లోడ్ చేయవచ్చు. ఆ విధంగా చేయడం ద్వారా అధికారులు విద్యుత్ కనెక్షన్ డేటాతో సరి చూసుకొని అనధికార సర్వీసులను వినియోగించుకుని కరెంటు వాడుతున్న సర్వీసులను గుర్తించడం సాధ్యమవుతుంది. అంతే కాకుండా సాంకేతిక సమస్యలు వచ్చినప్పుడు జిఐఎస్ టెక్నాలజీ ద్వారా సంబంధిత ఏఈ, లైన్‌మేన్ ఈ యాప్‌లో లాగిన్ అయి ఎక్కడ సమస్య ఉందో గుర్తించి సరిచేసేందుకు దోహదపడుతుంది. జిల్లాలో సర్వే సిబ్బంది సర్వే చేస్తున్నారు. ఆ క్రమంలో వ్యవసాయ కనెక్షన్లు, మీటర్లు, స్తంభం ఫొటోలు తీసి ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభించారు. ఈ జిఐఎస్‌తో బ్రేక్ డౌన్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. వర్షాకాలంలో ఈదురు గాలులతో విద్యుత్ స్తంభాలు నెలకొరిగి వైర్లు తెగిపడి బ్రేక్ డౌన్ అయిన సమయంలో, వేసవికాలంలో అధికలోడు వల్ల ట్రాన్స్‌ఫార్మర్ ఫెయిల్ కావడంతో నిలిచిపోయే విద్యుత్ సరఫరాకు బ్రేక్ పడనుందన్నారు. ఎక్కడైనా సాంకేతిక లోపం వచ్చిందని అధికారులు సిబ్బంది ఎల్.టి. లైన్లు, ఫీడర్ల వెంబడి చెక్ చేసుకోవాల్సిన పరిస్థితి లేకుండా దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ జిఐఎస్ అనే వెబ్‌సైట్ ద్వారా టెక్నాలజీని అందరినీ అలెర్టు చేస్తుంది.

ప్రశ్న. ఈ టెక్నాలజీ వల్ల సంస్థకు, వినియోగదారులకు ఏ మేరకు లాభం చేకూరుతుంది..?

జవాబు. ఈ టెక్నాలజీ వల్ల అధికారులకు విద్యుత్ అంతరాయం, ట్రాన్స్‌ఫార్మర్ లోపం వంటి సాంకేతిక సమస్యలు వినియోగదారుని వివరాలు ఎప్పటికప్పుడు పరివేక్షిస్తూ సమస్య ఎక్కడో గుర్తించి మరమ్మతులు చేపట్టి సరఫరా పునరుద్ధరించవచ్చు. ముఖ్యంగా రైతులకు నాణ్య మైన విద్యుత్‌తో పాటు అంతరాయం లేకుండా సరఫరా చేసేందుకు ప్రభుత్వం సాంకేతిక పద్ధతిని తీసుకువచ్చింది. ప్రతి స్తంభం, ప్రతి విద్యుత్ కనెక్షన్ లొకేషన్ క్యాప్చర్ చేసి జియో ట్యాగింగ్ చేస్తున్నామని క్యూఆర్ కోడ్‌తో స్కాన్‌తో ఆ కనెక్షన్ వివరాలన్నీ ఆన్లైన్‌లో ఫీడ్ అవుతాయని, అనధికార కరెంటు వాడుతున్న వారి కనెక్షన్లు తెలుస్తాయని వాటిని వెంటనే తొలగించవచ్చని తెలిపారు. బ్రేక్ డౌన్ సమస్య ఎక్కడ వచ్చిందో ఆన్‌లైన్‌లో చెక్ చేసి ఆ ఫీడర్ లైన్‌లను వెంటనే పరిష్కారం లభిస్తుంది.

ప్రశ్న. రొట్టెల పండుగ సందర్భాన్ని పురస్కరించుకొని బారాషాహిద్ దర్గాకు రాత్రి పగలు అన్న తేడా లేకుండా భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతారు. ఈ నేపథ్యంలో ఈ ప్రాంతంలో నిరంతరం విద్యుత్తు సరఫరా చేసేందుకు ఎటువంటి చర్యలు తీసుకున్నారు..?

జవాబు. బారా షాహిద్ దర్గాలో ఈనెల 29వ తేదీ నుండి ఆగస్టు 2వ తేదీ వరకు ఐదు రోజుల పాటు రొట్టెల పండుగ జరిగింది. కావున రొట్టెల పండుగకు విచ్చేసిన భక్తులకు నిరంతర మెరుగైన విద్యుత్ సరఫరా అందించేందుకు అన్ని ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేశాం. కలెక్టర్ ఎం.హరినారాయణన్ సూచనల మేరకు దర్గాలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిరంతర విద్యుత్ సరఫరాకు మూడు 315 కెవిఎ ట్రాన్స్ఫర్మర్స్, ఒక 250 కేవీఏ ట్రాన్స్ఫర్మర్స్, అయిదు 160 కేవీఏ ట్రాన్స్ఫర్మర్స్‌ను ఏర్పాటు చేశాము. 125 కెవిఎ డిపార్ట్మెంటల్ జనరేటర్ ను ఏర్పాటు చేశాం. దర్గా ప్రాంతంలో దాదాపు 2000 కెవిఎ సామర్థ్యంతో నిరంతర విద్యుత్‌కు అన్ని చర్యలు తీసుకున్నాం. గడిచిన 10 రోజుల నుంచి ఐ.ఇ. సెక్షన్ సిబ్బంది దర్గాలో పనులు పూర్తి చేసి విద్యుత్తు సరఫరా చేశాం. విద్యుత్తు ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యల్లో భాగంగా దర్గా ఆవరణంలో షాపులు పెట్టుకునే వాళ్ళ ఖచ్చితంగా ఎర్తింగ్ చేసుకొనేలా చర్యలు తీసుకున్నాం.

ఇంటర్వ్యూ